# 22.

# విద్యయొక్క పరమావధి సమభావన, వినయము

**కామము క్రోధము లోభము మోహము**
**విడువుము, నేనెవ్వడనని యనుకో**
**తము తామెరుగని దద్దమ్మలకగు**
**నరకములోపల నానా బాధలు**
**భజగోవిందం భజగోవిదం......**

పవిత్రాత్మ స్వరూపులైన విద్యార్థులారా!

శంకరుల యొక్క శిష్యులైన పదునాలుగు మంది, పదునాలుగు వైరాగ్య భావములను నింపుకొన్నటువంటి శ్లోకములు రచించారు. తదుపరి శంకరులవారు ద్వాదశమంజరి అని పన్నెండు శ్లోకములను పూర్తి చేసినటువంటి వాటిలో యిది ఆఖరిది. అయితే, ఈ శ్లోకమునందున్న వైరాగ్యము మరింత విపరీతమైన మార్గమును అనుసరించటమే కాకుండా అతి ప్రధానమైన జ్ఞాననేత్రము తెరుచుటకు అత్యవసరమైన మార్గాన్ని కూడను నిరూపించటం జరిగింది. కామ, క్రోధ, లోభ, మోహాది గుణములు దొరలవలె చేరి దొంగతనమునకు ప్రయత్నము చేస్తుంటాయి. కాని మనయొక్క దృష్టిలో దొంగలవలె చేరి దొరలవలే చలాయిస్తున్నాయి. ప్రతి మానవుని యొక్క హృదయమునందు జ్ఞానమనే మణులు దొంగిలించే నిమిత్తమై ఈ నాలుగు గుణములు ఒకవిధమైన ప్లానులు వేసుకొని ప్రతి మానవుని యొక్క హృదయాంతరము నందు చలామణి జరుపుతున్నాయి. ఇందులో కామము అనేవాడు ఈ నలుగురికి ప్రధానమైన లీడరుగా నిల్చి ఉంటాడు. మిగిలిన ముగ్గురు యితనినే అనుసరించుకుంటు, యితని యొక్క అభిప్రాయములకు తలలు ఊపుతూ మిగిలిన కార్యములు చేయటానికి సంసిద్ధులై ఉంటారు. అసలు జన్మమునకు మూలకారణము కామము. మరణమునకు కాలుడు. జీవితమునకు రాముడు. ఈ కాముడు,

sri sathyasai vachanamrutam

రాముడు, కాలుడు ఈ ముగ్గురి యొక్క చేతలయందు మానవుని యొక్క జీవితము మెలగుతూ ఉంటున్నాది. మధ్యనున్న రాముని యొక్క అనుగ్రహానికి పాత్రులైనప్పుడు ఈ కామ, కాలుని యొక్క తత్త్వములు మనలను హింసించటానికి పూనుకోవు. నివురుకప్పిన నిప్పువలే, పాచికప్పిన జలమువలె, పొరకప్పిన కన్నువలే ఈ జ్ఞానమును కామము కప్పుకొని ఉంటుంది. ఇప్పుడు ఈ కామమనే తెర ఎక్కడనుంచి వచ్చింది. దీని స్వభావము ఏమిటి? దీని పుట్టుపూర్వోత్తరాలు కనుక్కోవటం అత్యవసరము. ఈ కామము వల్ల నిత్యానిత్య విషయ పరిశీలన స్థంభించిపోతుంది. విచక్షణా భావమును మరచిపోతుంది. మోహమును అభివృద్ధి పరుస్తుంది. మోహము వలన జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. జ్ఞాపకశక్తి తగ్గిపోవటం చేత బుద్ధి క్షీణిస్తుంది. బుద్ధి క్షీణించటం చేత మానవత్వమే నాశనమవుతుంది. కనుక, ఈ కామమనేది మన జీవితానికి ఒక నాశనమును చేకూరుస్తుంది. మొట్టమొదట కామతత్త్వమేమిటో, కామ జన్మస్థానమేమిటో, కామము యొక్క స్వభావము ఏమిటో అర్థం చేసుకోవటం లేక విచారణ సల్పుకోవటం, దానియొక్క ఆదిని గురించి అన్వేషణ జరపటం చేయాలి. దానిని మనము తెలుసుకుంటిమా క్షణములో మనకు అతిదూరమై పోతుంది. మనము తెలుసుకొనక దానికే ప్రధానమైన స్థానమునందించి దానిని పెద్దగా మనము భావించటంచేత అది తలపైన ఎక్కి తాండవమాడుతున్నాది. దీనికి ఒక చిన్న కథ. ఒక గ్రామములో వివాహము జరుగుతున్నాది. వివాహమునకు ముందు దినము పెండ్లికుమారుని వారు ఒక గ్రామమునుండి తరలి వచ్చారు. పెండ్లికుమార్తె యింటివారు ఒక యింటిలో ఉంటున్నారు. ఈ ఇరువురికి మధ్యలో ఒకవ్యక్తి అటువైపున పెండ్లి కుమారుని వారికి, యిటు వైపున పెండ్లి కుమార్తె వైపు వారితో చాలా జబర్దస్తీ జరుపుతూ వస్తున్నాడు. పెండ్లి కుమారుని వారితో మీరు కాలమునకు సరిగా భోజనమునకు రావటంలేదు, మేము కాచుకోవలసి వస్తున్నాది. ఎన్ని పర్యాయములు పిల్చినా మీరు రావటంలేదు అని జబర్దస్తీగా వారి దగ్గర మాట్లాడుతున్నాడు. ఆ పెండ్లి కుమారుని వారు అనుకుంటున్నారు, అతను పెండ్లికుమార్తె యింటిలో పెద్దవాడు అని భావించారు. ఇంక పెండ్లి కుమార్తె యింటికి వస్తున్నాడు, 'మీరు మమ్ములను సరిగా గుర్తించటం లేదు. సరియైన గౌరవమును అందించటంలేదు. అలక్ష్యముగా ఉన్నారు అని పెండ్లి కుమార్తె వారితో జగడములు వేయటము. ఈవిధముగా

ఒక నాటకము ఆడటంచేత పెండ్లికుమార్తె వారు పెండ్లికుమారుని తరఫు పెద్ద అనుకోవటం ఈ రకంగా జరుగుతూ వచ్చింది. కానీ ఈ స్వతంత్రమనేది మితిమీరి పోయేటప్పటికి యితను ఎవరు ఎవరు అని యిద్దరూ చేరి అతని స్థితి గతులను కనుక్కోవటానికి ప్రయత్నం చేశారు. ఆ సమయం చూచుకున్నాడు ఎవ్వరికీ చెప్పకుండా పరుగెత్తాడు. నిజముగా ఈ యిద్దరికి పెద్దకాదు తాను. అదేవిధముగా ప్రవృత్తి, నివృత్తి రెండు స్థానములకు మధ్య లోపల కామము అనేది ఒకటి బయలుదేరి యిటువైపున, అటువైపున చాలా అధికారమును చలాయిస్తూ వస్తుంది. ఈ ప్రవృత్తి, నివృత్తి అనే రెండు తత్త్వములు విచారణ అనేటువంటి దానికి పూనుకుంటే కామము అనేది మటుమాయమై పోతుంది. ఈ కామమనే రోగము ఎట్టి ఔషధముతో చచ్చేది కాదు. ఎట్టి ప్రయత్నముతో అణిగేది కాదు. ఒక్క భగవత్ప్రేమానుగ్రహముచేతనే యిది పట్టుబడిపోతుంది. అట్టి భగవత్ప్రేమకు, అట్టి భగవత్ కృపకు పాత్రులమయ్యే ప్రయత్నానికి మనము పూనుకోవాలి. అట్టి ప్రేమను పొందే నిమిత్తమై సాధకుడు దక్షుడు కావాలి అని గీతకూడను ప్రబోధిస్తూ వచ్చింది. దక్షుడు అనగా సర్వవిద్యలు నేర్చుకున్నవాడు. ప్రవృత్తివిద్య, నివృత్తి విద్య, ఇహవిద్య, పరవిద్య అన్ని విద్యలు నేర్చుకున్నవాడు. 64 విద్యలుంటున్నాయి. ఈ 64 విద్యలు నేర్చుకున్నవానినే దక్షుడు అని పిలవవచ్చు. మనము పురాణ దక్షుని కథ వినియుండవచ్చును. ఈ పురాణదక్షునకు అందరూ ఆడబిడ్డలే. ఒక బిడ్డ సతీదేవి. సతీదేవి అనగా జ్ఞానవిద్య అనిపేరు. కనుక, ఈ జ్ఞానవిద్య ఈ దక్షుని దగ్గర ఉండటం చేత ఈశ్వరుడు ఆ సతీదేవిని వరించాడు. ఈమెను వరించుట చేత ఈశ్వరుడు దక్షునికి సంబంధుడుగా మారిపోయాడు. అదేవిధముగా భగవత్సంబంధము, ఈశ్వర సంబంధము మనకు కావాలనుకున్నప్పుడు మనము జ్ఞానదేవి అయిన సతీదేవిని మనలో ఉద్భవింపచేసుకోటానికి ప్రయత్నము సల్పాలి. కనుక, సాధకుడు ఈ జ్ఞానవిద్యను మనము ఆర్జించినప్పుడే సర్వవిద్యలు కూడను మనలను వరించటమే కాకుండా తరింపచేస్తాయి. అయితే ఈనాడు పేరుకు సాధకులమేగాని మనము సాపాటు రాయుళ్లమై పోతున్నాము. బండవలె తినటము, గుండువలె బలవటము, ఏదో ఒక కుంభకర్ణుని వలె నిద్రించటము కాలమును వ్యర్థము చేయటము. ఇట్టి సాధకులను పురస్కరించుకొనియె భారతీయ సంస్కృతి నేడు హాస్యాస్పదమునకు గురియైపోయినది.

ఎవ్వరికిని శ్రమయివ్వక, ఎవ్వరికిని శ్రమ కలిగించక తమ పని తాము చేసుకుంటూ తమ యొక్క తత్వాన్ని తమ యొక్క విశిష్ఠమైన సత్యాన్ని విడువక మార్గమును అవలంబించుతూ, ఇతరులకు మార్గదర్శకుడై అలవర్చుకున్నప్పుడే అతనిని ఒక వ్యక్తి క్రింద మనము గుర్తించటానికి వీలవుతుంది. కనుక, మనము ఈ వయస్సునందు ఆదర్శప్రాయుడుగా నిలవాలిగాని, అన్యులతో చెప్పించుకునే స్థితికి మనము దిగజారకూడదు. కనుక మన మానవత్వాన్ని పవిత్రమైన దివ్యత్వములో ప్రవేశింపజేయటానికి యిట్టి యువకులైన విద్యార్థులు ప్రప్రథమములో కంకణము కట్టుకొని తమ యొక్క కామతత్త్వమును, తమయొక్క క్రోధ తత్వమును, తమయొక్క విజృంభణము కొంతవరకు అణుచుకునే ప్రయత్నమునకు పూనుకున్నప్పుడే తాను విద్యకు అర్హుడుగా తాను కాగలడు. విద్య నిమిత్తమై విద్యాలయములకు వెళ్లటం. కాని, ఎందు నిమిత్తమై ఈ విద్యాలయములకు వచ్చినామో ఆ విషయము మర్చిపోవటం యిది విద్యార్థులు సరైన అర్థము చేసుకొనక ఈ విద్యను కొంతవరకు పొందటానికి ప్రయత్నము సలుపుతున్నారనే గోచరిస్తుంది. అనేకమంది విద్యాలయములకు వెళ్లి విద్య విషయము మరచి విషయ సంబంధమైన మాటల లోపల కాలమును వ్యర్థపరచి పరీక్షలు వచ్చేటప్పటికి కొత్త పుస్తకము తెరవటానికి ప్రయత్నిస్తారు.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! ఈ వయస్సు బంగారు వయస్సు. మహా పవిత్రమైన వయస్సు. ఈ వయస్సు మరి చిక్కాలంటే, దక్కాలంటే చిక్కేది కాదు, దక్కేదికాదు. ఈ చిక్కిన కాలమును, దక్కిన సమయాన్ని మనము కొంతవరకు పవిత్రము చేసుకోవటానికి తగిన ప్రయత్నానికి పూనుకోవాలి. పూనుకొనుటకు పూర్వము మనము ఇంద్రియములను నిగ్రహించుకోవాలి. ఇంద్రియములను నిగ్రహించుకున్నప్పుడే సర్వవిద్యలను మనము హస్తగతము చేసుకోవటానికి ధైర్యసాహసాలు, దానికి తగిన బుద్ధికుశలతలు అభివృద్ధి అవుతాయి.

**ఏమీ లేని బుఱ్ఱలోన నింపవచ్చు ఏమైన**
**ఏమేమో నిండియున్న బుఱ్ఱ నింపవీలగునా!**

**కలిబోధలు నిండియున్న తల బుఱ్ఱది ఖాళీ యగున**

**తలబుఱ్ఱది ఖాళీ కాక యిల సుకృతము నింపనగున!**

కనుక, మన యొక్క తలను పవిత్రమైన భావములతో, సుకృతమైన శీలముతో దివ్యమైన జ్ఞానముతో నింపుకోవటానికి తగిన ప్రయత్నము సల్పాలి. అంతేగాని ప్రపంచములో జరిగే నానా లౌకికమైన మలిన విషయాలను, రోతపట్టిన పాత గుణములను నింపుకోవటానికి పూనుకోకూడదు. దీనినే భగవద్గీత కూడను “నాయనా! నీలో చేరిన అపవిత్రమైన భావములను ఒక్క పర్యాయము చక్కదిద్దుకోవటానికి సాధ్యముకాదు. మెల్లమెల్లగా సరియైన మార్గములోనికి తెప్పించుకోమని” ప్రబోధిస్తూ వచ్చింది. ఈవిధమైన మార్గమును కొంతవరకు ఉద్రేకపరచే గుణములను క్రమక్రమేణా తగ్గించుకోటానికి ప్రయత్నము ఎట్టిదనగా ఒక్క భగవదనుగ్రహానికి, భగత్ప్రేమకు హృదయాన్ని అర్పితము చేసినచో, అప్పుడే క్రమక్రమేణా యివన్నీ చల్లబడి తగ్గిపోవటానికి పూనుకుంటాయి. కాని ఒక్కొక్క పర్యాయము మనము తలుస్తూ ఉంటాము, ఇంత గాఢముగా నిల్చిపోయిన దుర్గుణాలను ఏవిధంగా తప్పించు కోవటానికి వీలవుతుంది. యిది నా జన్మలో జరగదని కూడను మనము బలహీనులై పోతుంటాము. అట్టి బలహీనతకు మనము చోటివ్వకూడదు. తగిన ప్రయత్నముతో గట్టిపట్టుతో దానిని సాధించటానికి మనము ప్రయత్నించాలి. మంచి అభ్యాసములు గాని, చెడ్డ అభ్యాసములు గాని మన అభ్యాసము చేతనే అవి పెరిగినవి గాని, హఠాత్తుగా మన తలలో చేరినవి కాదు. మంచికి చెడ్డకు అభ్యాసములే మూలకారణము. కనుక, ఏవిధమైన అభ్యాసములతో అవి తలమీరి పోయినవో, ఆవిధమైన అభ్యాసములే తలంచి మనము ఆవిధమైన అభ్యాసముల లోపల ఈ జీవితమును అంకితము చేసి ఆ పెరిగిపోయిన అభ్యాసములు తగ్గించుకోవటానికి తగిన ప్రయత్నము సల్పాలి. దీనికి ఒక చిన్న కథ.

## దుర్గుణములను అభ్యాసం ద్వారా క్రమక్రమేణా తగ్గించుకొనుట

ఒక వ్యక్తి నిరంతరము నల్లమందు తినటము అలవాటు చేసుకున్నాడు. కాని, దానిని నియంత్రించటానికి సాధ్యం కావటంలేదు. నిరంతరము మత్తులో వుండి తన ఆరోగ్యము పాడు చేసుకుంటూ వస్తున్నాడు. ఈ విధమైన బలహీనస్థితి లోపల ఆ గ్రామమునకు ఒక మహనీయుడు వచ్చాడు. ఆ సమయములో గ్రామస్తులందరు ఆ మహనీయుని దర్శించటానికి అందరూ వెడుతూ వచ్చారు. ఆ గుంపులతో ఈ వ్యక్తికూడ ఆ మహనీయుని దర్శించటానికి వెళ్లాడు. ఒక్కొక్కరు వారి కష్టములు, నష్టములు, అనారోగ్యములు యిలాంటి

srisathyasaivachanamrutam

బాధలను చెప్పుకుంటూ ఆ మహనీయుని ప్రబోధలు కొంతవరకు ఆలకించి, ఆదేశములను అందుకొని వస్తుండేవారు. ఈ సమయము లోపల ఈ నల్లమందు తినే వ్యక్తి సమీపించేటప్పటికి 'నాయనా! నీ ఆరోగ్యాన్ని పాడుచేసుకున్న తరువాత ఈ లోకములో నీవు చేయవలసిన కార్యములు ఏరీతిగా చేయగలవు? కనుక నీవు ఆరోగ్యమును మొట్టమొదట చూచుకో. దేహమే ఆరోగ్యము. "ధర్మార్థ కామ మోక్షానాం ఆరోగ్యం మూలముత్తమమ్" ఆరోగ్యము చక్కగా వుంటే కదా ఈ ధర్మార్థకామమోక్షములనే పురుషార్థములను మనము సాధించటానికి వీలవుతుంది' అని అనేకరకములైన బోధలు చేసి నల్లమందు తగ్గించుకోవటానికి తగిన ప్రయత్నము సల్పమన్నాడు. 'స్వామీ! నాచేత కాకుండా ఉన్నది. తమరే ఒక ఆదేశమిచ్చి అనుగ్రహించి అభ్యాసము ఏరీతిగా చేయాలో చెప్పండి తప్పక అనుసరిస్తానని ప్రార్థించాడు. అయితే 'నీవు నిత్యము ఎంత ప్రమాణము నల్లమందు 'తింటున్నావు' అని అడిగాడు ఈ గురువు. అతను చెప్పాడు ఒక్కొక్క దినము ఎక్కువ ఒక్కొక్క దినము తక్కువ తింటాను. ఇంతవరకు కొలతగా చెప్పవచ్చునని ఒక సైజు చెప్పాడు. సరే అంత ప్రమాణమైన సుద్దముక్క తెప్పించాడు. 'నాయనా! యింత ప్రమాణము దినము తింటుండమని' చెప్పాడు. అందుకు తాను చాలా ఆనందించాడు. వదలమని చెప్పలేదు తినమని చెప్పాడు కదాయని. 'స్వామీ! యింత ప్రమాణము దినము తింటాను అని ఒప్పుకున్నాడు. అతను ఒప్పుకున్న తక్షణమే ఈ మహనీయుడు చెప్పాడు నీవు తీసుకునే సమయమునందు యింత ప్రమాణము తీసుకో. యిదే సుద్దముక్కతో మూడు పర్యాయములు ఓం అని వ్రాసి దానిని భద్రంపెట్టుకో. నిత్యము యీ సుద్దముక్క అంతనే తిను' అని ఈ గురువు బోధించాడు. ఈవిధముగా తన కొలత తీసుకుంటూ మూడు పర్యాయములు ఓం అని వ్రాసేటప్పటికి దినదినమునకు సుద్దముక్క తగ్గుతూ తగ్గుతూ వచ్చింది. ఈవిధముగా సుద్దముక్క అంతర్థానమై పోయింది. వ్యాధి పూర్తిగా నిల్చిపోయింది. మనము ఒకే దినము పది, పన్నెండు, ఇరవై సిగరెట్లు త్రాగేవారు ఒక దినము ఒకటి, తరువాత రెండు క్రమక్రమేణా రాత్రింబవలు చైన్ స్మోకింగ్ చేస్తూ కూర్చుంటారు. ఈ అభ్యాసము క్రమక్రమేణా పెరుగుతూ వచ్చింది. అయితే దానిని క్రమక్రమేణా తరుగుతూ తప్పించుకోవాలి. ఇదే విధముగా అనేక విధములైన దుర్గణములను క్రమక్రమేణా

పెంచుకుంటూ పోతున్నాము. ఈ దుర్గుణములు మనకు అపకారి అని గుర్తించిన తరువాత క్రమక్రమేణా దానిని తగ్గించుకోవటానికి ప్రయత్నము చేస్తే అప్పుడు మనము తెలివితేటలు కలిగిన వారమని అనుకోవచ్చు. ఇది తప్పని తెలిసి కూడను దానిని తగ్గించుకోవటానికి తగిన ప్రయత్నము చేయలేకపోతే మన తెలివితేటలు కాల్చటానికా, ఎందుకు ఈ తెలివితేటలు. కనుక, ఈ విధమైన అజ్ఞానములో మనం పోయి, శంకరుల యొక్క శిష్యులు చెప్పినట్లుగా మూఢమతే, మూఢమతే, మూఢమతే అని అనిపించుకోకుండా, ముక్తమతే, ముక్తమతే, ముక్తమతే అనిపించుకునే ప్రయత్నానికి భక్తులందరు సంసిద్ధులుగా ఉంటుండాలి. నిరహంకార భావమే బ్రహ్మప్రాప్తి అని కూడను చెప్తుంటారు. నిరహంకామనగా అహంకారము లేకుండా ఉండటం. ఈ అహంకారము ఏవిధంగా పోతుంది అనేటువంటిది మనం విచారణ చేయాలి. అయితే, అహం నిరంతరం ఉంటుంది, ఆకారమే మార్పు కావాలి. ఆకారముతో వచ్చినదానినే మనము ఈనాడు అహంకారము అని అనుకుంటున్నాము. అహంకారమనగా పొగరుబోతు తనమని మనము భావిస్తున్నాము కాని అహంకారమనగా పొగరుబోతు తనము కాదు. తామసికము నందు అహంకారము కలదు. అహంకారము అనేది త్రికాలము లందు ఉంటుంది. ఈ అహంకారము మానవుని మహావికారమైన స్థితికి గొనిపోతుంది. ఇది కేవలము స్వార్థమును అభివృద్ధి పరచి, కట్టకడపటికి తనయొక్క తత్త్వమును తాను మరపింప చేస్తుంది. కనుక, ఈ అహంకారము కొన్ని అనుకూలములను పురస్కరించి కూడను చేరుతుంది. అందమును బట్టి అహంకారము రావచ్చు. జన సమూహమును బట్టి అహంకారము రావచ్చు. కులమును బట్టి అహంకారము రావచ్చు. అహంకారమునకు ఒక్క త్రోవ అనేది లేదు. ఏమార్గము నందైనా తనకు కొంత బలము యేర్పడినటువంటి సమయములో అహంకారము తలపై కెక్కుతుంది. మన అందము చూస్తామా అంటే మించుమించినట్లుగా ఒక్కతూరి యిది మాయమైపోతుంది. ఇంక జన సమూహము, ధనము చూస్తామా అంటే అది ఒక కదలే మేఘముల మాదిరి భ్రమింపచేసి తక్షణమే ఎండమావుల వలే మరుగున పడిపోతున్నది. ఇంక మనము అధికారము యొక్క అహంకారము చూస్తామా అంటే అధికారము ఎప్పుడు ఊడుతుందో, ఎప్పుడు పెరుగుతుందో, ఉన్నంతవరకే మనకు ఈ బాధ్యత. తదుపరి

sri sathyasai vachanamrutam

మనము సామాన్యమైన స్థితియందుంటాము. అధికార స్థితియందు కూడను అహంకార పడటానికి వీలులేదు. ఇంకా విద్యావిషయమును గురించి మీరు అహంకార పడతారా! విద్య అంటే అహంకారము లేనిదే విద్య. అహంకారము ఉంటే అది విద్యయే కాదు. విద్యా వినయ సంపన్నే అన్నారు. పండితః సమదర్శనః' కనుక ఈ సమతత్త్వము, వినయము విద్యల వలన అలవడుతుంది.

**అంధుడగువాడు ఎవ్వడు ఈ అవనియందు**
**విద్యలన్నియు ఉండి జ్ఞానము లేని గుడ్డివాడట.**

అనగా పెద్దలను చూచినప్పుడు దేశకాల పాత్రల ననుసరించినప్పుడు అతి వినయులై అందరికి కొన్ని రకములైన సేవలు అందించే స్థితిలో మనయొక్క వ్యక్తిత్వాన్ని అర్పితము చేయటానికి పూనుకోవాలి. ఇదే నిజమైన విద్యకు సరైన అర్థము.

**విశ్వమే విద్యాలయంగా భావించుకోవాలి**

**అందము ప్రాయము ఇంద్రియశక్తియు ఉందని నిక్కకురోరన్నా**
**ముందున్నదిరా తొందరలోనే ముసలితనమ్మను ముసళ్ల పండుగ**
**మసలలేవు కనుమసకలు మోమున ముడతలుబడె**
**తలనెరిసె కదా ముసలికోతియని పసివారలు నిను**
**ముసిముసి నవ్వగ కసరే బొమ్మా.....**

కనుక, విద్యార్థులైనవారు ధనముగాని, అధికారముగాని, కులమునుగాని, వయస్సును గాని లెక్కించక విద్యను మాత్రమే లక్ష్యమునందుంచుకున్నప్పుడు వినయభావముతో విద్యకు ప్రకాశవంతమైన తేజస్సును అందించిన వారమవుతాము. కర్తవ్యాన్ని గుర్తించిన వ్యక్తులుగా తయారు కావాలి గాని అధికారమునకై అఱ్ఱులు చాచి ఈ జగత్తునంతా కల్లోల పరచటానికి పూనుకోకూడదు. విద్యలో అధికారి కావాలనుకున్నప్పుడు మనము విద్యను ఆర్జించాలనుకున్నప్పుడు కర్తవ్యాన్ని కొంతవరకు మనము గుర్తించుకోవాలి. తన తత్త్వాన్ని తాను తెలుసుకొని, ప్రపంచము యొక్క స్థితి గతులను విచారించి ఈ మానవత్వములో చెలరేగిన చంచలత్వమనే శక్తి సామర్థ్యములను తనయందు నిత్యానుభవములో ప్రకటించటానికి పూనుకోవాలి.

దివ్యాత్మ స్వరూపులైన విద్యార్థులారా! ఈ విద్యను ఆర్జించే నిమిత్తమై కళాశాలకు

srisathyasaivachanamrutam

వెళ్లటము, యింకా విద్యాలయములకు వెళ్లటము, పాఠశాలలో ప్రవేశించటము జరుగుతుంటాది. కాని మన విద్య కేవలము ఒక పాఠశాలనుండి కాదు, ఒక కాలేజీ నుండి కాదు, ప్రపంచము అన్ని వైపుల నుండి తెలుసుకోవలసిన విద్యలు ఎన్నియో ఉంటున్నాయి. కార్మిక వృత్తియందు మనము తెలుసుకోవలసినవి, కర్షకవృత్తి యందు తెలుసుకోవలసింది, బజారునందు తెలుసుకోవలసింది, వ్యాపారమునందు తెలుసుకోవలసింది, విద్యకు అంత్యమనేదే లేదు. ప్రతి ఒక్క ప్రదేశము నుండి కూడను తెలుసుకోవలసినవి ఎన్నియో ఉంటున్నవి. ఈ విశ్వమే విద్యాలయముగా భావించుకోవాలి.

**నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడు దాక పొట్టకై**
**హద్దును పద్దులేక వ్యయమందగ చేయుచు జీవితంబు నీ**
**విద్దెల ధారపోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ**
**పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!**

అన్నారు. కనుక, దైవభావమును నీ హృదయస్థానమునందుంచుకొని జీవులను కూడా brotherhood అనే దీనిలో భావించుకో, తప్పక అంతా పవిత్రమై పోతుంది. ఇట్టి పవిత్రమైన స్థితి మనకు లభ్యము కావాలనుకున్నప్పుడు ఈ కామక్రోధలోభ మోహమనే నలుగురు దొంగలను మనలో నుంచి బయటకు తరమటానికి పూనుకోవాలి. ఈ దొంగలు మనలో వున్నంతవరకు ఈ జ్ఞానమనే ధనము మనకు దక్కుతుందనే నమ్మకము ఉండదు. అయితే, ఈ దొంగలను తరిమి మనము యింకో పెద్ద దొంగను మనలో చేర్చుకోవాలి. ఆ దొంగయే భగవంతుడు. అందువలనే చిత్తచోర అనే పేరు అతనికి సార్థకము. సూరదాసును కొంతదూరము చేయి పట్టుకొని నడిపించుకొని వెళ్లి తదుపరి, 'నీవు కృష్ణుడవు నాయనా!' అని ప్రశ్నించిన తక్షణమే 'ఒరే! ఈ సూరదాసు కనుక్కున్నాడ'ని తక్షణమే చేయి వదలి దూరం వెడతాడు. అప్పుడు సూరదాసు చెబుతాడు.

**అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు ఘనముకంటె అతి గణనీయుడవు**
**ఎనుబది నాలుగు లక్ష జీవముల అనయంబును ఎడబాయకుందువట**
**అణురేణువుతృణకాష్ఠము మొదలుగ అఖండరూపుడవై వెలయుదువట**
**ఘనమగు దొంగలలో గజదొంగవు నీవు ॥నిను కనుగొన గలమా॥**



sri sathyasai vahamrutam

అని కృష్ణుని వర్ణించినాడట. అహంకారమును అణచటానికి భగవంతుడొక్కడే సమర్థుడు. అహంకారము అణచటము చేతనే అతనికి మధుసూదన అనే పేరును అందించడం జరిగింది. మధుసూదన 'మధు' అనే రాక్షసుని సంహరించినవాడు కనుక మధుసూదన అని అర్థము. కాని, యిక్కడ ఆ అర్థమును తీసుకోకూడదు. మధు అనగా తేనె కంటే తీయని పదార్థము. మధురమైనది. మానవునికి అహంకారమే అతి మధురమైనది. మానవుని మధురమైన అహంకారమును హతమార్చేవాడు కనుకనే అతనికి మధుసూదన అనిపేరు వచ్చినది. మధు స్వరూపమై, మధురమైన భగవంతుడు మానవుని మధురమైన అహంకారమును హతమార్చటంచేత మధుసూదనుడైనాడు. తాను మధువుగానే ఉన్నాడు. హతమార్చినది మధువునే. కనుక మధు అనే దాన్ని మధునే హతమార్చింది కనుక అతనికి మధుసూదనుడని పేరు. మనకు అతి మధురమైన అహంకారాన్ని హతమార్చేవాడు ఒక్క భగవంతుడే కనుక అట్టి భగవంతుని విశ్వసించి అహంకారమును విసర్జించి మన జీవితమును ఒక సేవకావృత్తియందు గాని పవిత్రమైన భగవత్ప్రీత్యార్థముతో గాని మనయొక్క కార్యములందు మనము కాలిడినప్పుడే దానికి తగిన గౌరవము, దానికి తగిన మర్యాద భగవంతుడే ఏ సమయమునందు, ఏకాలమునందు ఏ వ్యక్తికి ఏ అధికారమునందించాలో తానే చూచుకుంటాడు. కానీ, మనము ఈ దుర్గుణములనే ఈ నాలుగు దొంగలను మననుంచి దూరము చేసుకునే ప్రయత్నము లోపల పూనుకోవాలని శంకరుల యొక్క వాక్యము ప్రబోధిస్తూ వచ్చింది. భజగోవిందము 31 శ్లోకములు కూడను కొంత వరకు నిత్యము మనము వింటూ వస్తున్నాము. కొన్ని ఈ సమావేశములో చెప్పుకోదగినవి కాదు. అవి కొంత అతని దృష్టిలో ఉత్తమమైనవిగా ఉండినప్పటికి ఈ కాలమునకు, ఈ పరిస్థితికి అవి కొంత తగనివిగా ఉండటంచేత ఈ శ్లోకములను నేను వదలి వెడుతున్నాను. మిగిలిన వాటిని అందుకొని తదుపరి మీకు అవసరమైన విషయాల నంతను మీతో చర్చించి, మీలో నున్న doubts పూర్తి నిర్మూలము చేసి, వాటిని దూరము చేసి మిమ్మల్ని హాయిగా ఆనందము, నిశ్చలంగా, నిర్మలంగా, నిస్వార్థమైన సేవకులుగా తయారుచేసి మీమీ స్వస్థానానికి పంపుతాను. ఇంతటితో ఈ ప్రసంగాన్ని ముగించి కొంతసేపు నామస్మరణ చేద్దాం.

**(తేదీ 09-06-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam